# సావిత్రి గ్రహించిన సత్యం

బి.య్యే ప్యాసయింది సావిత్రి. లెక్కలు బియ్యేలో ఆ పిల్లకి ఫస్టుక్లాసు వచ్చింది. తండ్రి పరంధామయ్యకి యింత కంటే గర్వంకాని మరో వ్యాపకంగాని లేదు. తల్లి బంగారమ్మ మాత్రం ఎంతట ఓ అయ్యచేత దీన్ని పెడదామా! అని ఉవ్విళ్లూరేది. అందులోనూ ఆ ఒక అయ్య ఎవరో పరాయి వాడు గాకుండా మేనల్లుడు సత్యమే అయితే ఎంతో బాగుంటుందని ఆవిడ అభిప్రాయం. కాని ఆమె నోరు మెదపలేదు. ఆ యింట తల్లి ఒక్కర్తే ఒక పక్షం. తండ్రీ కూతుళ్ళిద్దరూ ఒక పక్షం. బంగారమ్మ బి.ఎ. అవకపోవడంచేత, ఆవిడా ఆవిడతోపాటు ఆవిడ మొత్తం వంశం అంతా ఎడ్డె మనుషులని తీర్మానిస్తూ వుంటారు పరంధామయ్యగారు అవకాశం దొరికినప్పుడల్లా.

సావిత్రికి ఏం తోచేదికాదు. శలవులు కావడం ఒకటి రెండోది ఊరికే విసుగు వచ్చేడం! ఎవర్నయినా ఉడికించడం, అందం చందం డాబూ దర్పం ప్రదర్శించి ఎవర్నయినా అల్లరి పెట్టడం గారాలపిల్ల సావిత్రికి యిష్టం! ఈ హాబీలు అంతగా తీరలేదు.

ఇంట్లో అమ్మ మాత్రం లోకువ. తండ్రి సరేసరి. ఊళ్లో ఎవరికెవరు గనుక?

పోనీ మావయ్యగారి ఊరు వెడదాం అనిపించింది. అది ఉత్త పల్లెటూరు. మావయ్యా, అత్తయ్యా వాళ్ళ కొడుకు సత్యం ఎడ్డెమనుషులు! ఇవి సావిత్రికి తండ్రి అవకాశం కలిగినప్పుడల్లా నూరి పోసిన విషయాలు. అంచేతనే సావిత్రికి ఆ ఊరు వెళదామనిపించింది. "కాకుల మధ్యకి వెళితేనే హంసకి రాణింపు" అనుకుంది.

రైలు ఆగుతూ వుండగానే పోర్టరుకోసరం చూసింది సావిత్రి. అసలు అంతా స్టేషన్ నిర్మానుష్యంగా వుంది. సావిత్రి దిగిందో లేదో రైలు కూసింది. ఆమెకి ఎవరిమీదో తెలీకండా కోపం వచ్చింది. తన హోల్డాలు తానే దింపుకోవడంకన్నా తలవంపు యింకొకటి లేదు.

వెళ్ళిపోయిన రైలు కేసి కసిగా చూస్తున్న సావిత్రి "కొంచెం ఆలస్యం అయ్యింది సావిత్రీ! పాడు ఎద్దులు.. కొత్త చేశాయి!" అన్న మాటలు వినిపించి వెనుతిరిగింది. దాంతో ఆమె ప్రాణం తెప్పరిల్లిందిగానీ, ఆ భావాన్ని దాచేసి వచ్చిన వ్యక్తిని కొత్త ఆటబొమ్మ కేసి జూసినట్లు చూసింది.

"మీరు" అందామా, "నువ్వు" అని పిలుద్దామా అని చూసి పంచే, బనీనులాంటి చొక్కా చూసి

"నువ్వు మావయ్య గారి సత్యానివా?" అని అడిగింది.

"మరచిపోయ్యావన్న మాట!" అన్నాడు సత్యం నొచ్చుకుని, చిన్నబుచ్చుకుని.

సావిత్రిని సత్యం చాలా ఆప్యాయంగా చూశాడు. హోల్డాలు బండీలో పడేయబోతూ "ఎక్కగలవా, జాగ్రత్త!" అని అడిగి, కచ్చితంగా ఆ పిల్లకి ఎడ్ల బండీ ఎక్కడం రాదని గ్రహించి, హోల్డాల్ క్రింద పడేసి "దీనిమీద కాలేసి ఎక్కు" - అని చెప్పాడు.

ఇంతలో స్టేషనుమాస్టరు సత్యాన్ని పలకరించాడు. "మా అత్తయ్య కూతురు సావిత్రి" అని చెప్పి మళ్లీ చటుక్కున జ్ఞాపకం తెచ్చుకొని "బియ్యే ప్యాసయ్యిందిం మాష్టారూ.. అందుకే రెండెడ్లబండీ ఎక్కడం రాదు!" అని నవ్వాడు సత్యం.

బదులుగా స్టేషను మాష్టరు కూడా వయసు మళ్ళిన నవ్వు ఒకటి నవ్వి తన పనిలో నిమగ్నుడైపోయాడు. సత్యం చిలిపితనం, చమత్కారం సావిత్రి మెచ్చుకోలేదు. బి.ఏ ఫేలయి ఉడుక్కున్నాడనుకుంది.

"బండివాడివి నువ్వేనా? ఇంకా ఎంతదూరం వెళ్లాలి?" చాలా సిన్సియర్‌గా అడుగుదామనుకున్నా సావిత్రి గొంతులో ఎకసక్కెం ధ్వనించింది."చిత్తం" అంటూ సత్యం ఛంగున బండిమీదికెగిరి ఎద్దుల్ని అదిలిస్తూ "ఎనిమిది మైళ్ళు వెళ్లాలి" అన్నాడు.

చనువుగా మధ్యమధ్య కుశల ప్రశ్నలు వేస్తూ హుషారుగా వున్నాడు సత్యం. బండిలో గడ్డిమీద, ముళ్ళమీద కూర్చున్నట్లు కూచున్నది సావిత్రి. "నేరకపోయి వచ్చానురా" అన్నట్లు మొహంపెట్టుకుంది.

మువ్వలు గలగలమన ఎద్దులు పరిగెడుతూ వుంటే-సత్యం ముంగురులు మోహానపడి నృత్యం చేస్తూ వుంటే - నీరెండలో చుట్టూరా పచ్చని చెట్లూ, చేలూ ఎంతో అందంగా వెలిగిపోతూ ఉంటే.. అంత ఆహ్లాదకరమైన ప్రయాణంకూడా సావిత్రి దర్పాన్ని చెరపలేక పోయింది. ఆ ప్రశాంతతా, పచ్చతోరణమూ ఆమె వూహించుకున్నవిగాక పోవడంచేత బలవంతంగా ఆనందాన్ని అణగతొక్కేసింది.

మిసమిసలాడే యౌవనంలో వున్న సత్యం నిండు విగ్రహమూ, చెంపకు చారెడేసి ఉన్న కళ్ళల్లో నైర్మల్యమూ, మాటలలోని నిరాడంబరమూకూడా ఆమె అహంకారాన్ని తగ్గించలేకపోయాయి. "పల్లెటూరి మొద్దు" అన్నమాటే బలవంతంగా మననం చేసుకుంటున్నట్లు ఆ పిల్ల అతని కేసి చూసింది!

"ఈ రొడ్డుమీద ఈ నీరెండలో బండి తోలుకుపోవటం అంటే నాకెంతో సరదా తెలుసా!" సత్యం చెప్పాడు కాని, సావిత్రి వినలేదు. ఆమె ముభావం గ్రహించి "ఏం సావిత్రీ! ఒంట్లో బాగాలేదా?' 'ఇదో, ఇల్లువచ్చేసిందిలే!" అని ఎద్దుల్ని అదలించాడు.

అలాగ అతడు అన్న అరగంటకిగాని ఇల్లు రాలేదు. మావయ్య యింట్లో లేడు. అత్తయ్య సుందరమ్మ ఎదురు వచ్చి "యెన్నాళ్ళ కెన్నేళ్ళకమ్మా! రా! రా! ఏళ్ళ తరబడి అడగడమేగానీ, నువ్వ రానూ లేదు. మీవాళ్ళు పంపనూ లేదు" అని సాదరంగా ఇంట్లోకి తీసుకుని వెళ్ళింది.

పెద్దదేమో గడప, దాటుతున్నప్పుడు సావిత్రి బొటన వేలికి తగిలింది. ఇంతలేసీ ద్వారబంధాలెందుకో అనుకుంది. ఇంటి ముంగిట ముగ్గులూ 'ద్వారబంధం" గుమ్మాలకి రంగులూ

మరీ కొట్టవచ్చినట్లున్నాయి! ఇంట్లో ఏ ద్వారబంధమూ తలకి తగలదు. అన్నింటికీ పెద్ద పెద్ద గాజు పూసల పేర్లు కట్టారు!

సావిత్రి సుందరమ్మ వేసిన కుశల ప్రశ్నలకి తనకి తోచిన విధంగా క్లుప్తంగా జవాబులిచ్చింది. ఆమాత్రం గౌరవం చాలు. ఇదేం పరీక్ష పేపరు కాదుకదా అనుకుంది. అక్కడ తనకి మార్కులు, రిమార్కులు యివ్వగల "మొనగాళ్లు" లేరని ఆమె ధైర్యం.

పెద్ద పెరట్లో సాయంత్రం సుందరమ్మ తులసిపూజ చేస్తున్నప్పుడు సావిత్రికి; సత్యం చెల్లెలు ఒక యెనిమిదేళ్ళది వసంత ఒక ముక్కాలిపీట తెచ్చి వేసి "కూచో వొదినా!" అంది. సావిత్రి కూచుంది.

"ఆకాశంనిండా పేదరాశి పెద్దమ్మ కుంకమూ, పసుపూ ఎండేసుకుంది వొదినా! చూడు" వసంత ఏదో కొత్త వింత చెపుతున్నట్లు వేలెత్తి చూపింది సావిత్రికి.

"ఎవరు చెప్పారు నీకు? నే చెబుతా విను. వెలుతురే అలాగ " స్కేటర్" అయ్యింది" సావిత్రి గర్వంగా చెప్పి, విపులంగా, చెప్పాననుకుంది. "నువ్వేం మాటాడుతున్నావో ఆ భాష నాకు తెలీద"న్నట్లు కళ్లింతజేసుకుని వసంత కిమ్మన కుండా అక్కడమంచి వెళ్ళిపోయింది.

పెరడంతా పాదులూ, మొక్కలూ ఎక్కువగా వున్నాయి. చిక్కిరిబిక్కిరిగా పసిపిల్లాడి వూహలలాగ ఒక దానిమీద ఒకటి అల్లుకుని పోయాయి. గడ్డిసైతం మొలిచింది. రకరకాల పూలూ, తీగెలూ వున్నాయి. వాటిలో చాలా భాగం సావిత్రి మున్నెన్నడూ ఎరుగనివి.

ఒక ప్రక్క ఆవుల శాలలో రెండు గేదెలూ, రెండు ఆవులూ వున్నాయి. అక్కడ ఏ మొక్కా మోడూ లేవు. ఆవులలో కపిలగోవు సావిత్రికి నచ్చింది. రెండు కొబ్బరిచెట్లు, ఒక కరివేపాకు చెట్టూ వరుసగా వున్నాయి. పెద్ద బాదంచెట్టు కూడా వుంది. కొబ్బరి చెట్టుమీదనించి గబగబ ఒక ఉడుత దిగివచ్చి తులసికోటదగ్గర వెనక్కాళ్ళమీద నుంచుంది. అది గబగ ముందు రెండు చేతులతోనూ ఏదో తింటూ వుంటే వెక్కిరించినట్లుంది సావిత్రికి. నవ్వుకుంది ముచ్చటపడి తనలో తనే.

పాలు తియ్యడానికి దూడను వదుల్తూ సత్యం పాల చెంబుతో అక్కడికి వచ్చి "ఏం వసంతాలూ! మీ వొదిన నవ్వుతున్నదే... మన అదృష్టం పండిందన్న మాటే!" అని గబగబా శాలలోకి వెళ్ళిపోయాడు.

సావిత్రికి చప్పున ఏ జవాబూ స్ఫురించలేదు. సత్యాన్ని మాటల్లో చిత్తు చెయ్యడానికి ఉదయం వచ్చిన దగ్గరనుంచి తన విజ్ఞానం అంతా తిరగేసి సావిత్రి చేసిన ప్రయత్నం ఫలించింది కాదు. ఆమె ఏమీ అనకుండా పౌరుషంగా వచ్చి, సత్యం పాలు పితుకుతూ వుంటే తదేకంగా అటు చూస్తూనించుంది.

సత్యం వేగంగా పాలు రెండు చేతులతో పిండుతూనే సావిత్రి కేసి తిరిగి "మావూరు బావుందికదూ!" అన్నాడు.

"పిచ్చిపట్టుంది" అని ఠపీమని జవాబిచ్చింది సావిత్రి. "అమ్మయ్య, ఇప్పటికి దెబ్బతీశాను" అని వెట్టాచ్చింది.

సత్యం కొంచెం నొచ్చుకున్నవాడల్లా తమాయించుకొని "సరేలే! మొదట్లో అలాగే అన్నా.. తర్వాత వదలి వెళ్లలేనంటావ్ తెలుసా?" అని పాలు తీయడం ముగించి "వసంతా! ఇది అమ్మకివ్వమ్మా!' అని చెంబు అక్కడ వుంచి నూతి దగ్గరికి వెళ్ళిపోయాడు.

చీకట్లు ముసిరి ఆకాశంమీద బిలబిలా నక్షత్రాలు మొలిచేవరకూ పక్షులు ఒకటే గోల పెట్టేశాయి! సావిత్రి ఇన్ని రకాల పిట్టలు యింత అల్లరి చెయ్యడం ఎన్నడూ చూడలేదు. వాళ్ళ పెరట్లో దేశవాళీ విదేశీ మొక్కలు రకరకాల పూలవి కొల్లలు వున్నాయి. గాని ఈ అల్లిబిల్లి మొక్కలే ఆమెని మగ్ధురాల్ని జేశాయి.

అది వరకే తనకివున్న ఎన్నో దురభిప్రాయాల్ని మార్చుకుందుకి సావిత్రి అభిమానం ఒప్పుకోలేదు కానీ, లేకపోతే ఈపాటికే ఆ పిల్ల వెర్రి ఆనందంతో తువ్వాయితో అడి, వసంతతో పాడి పూలు కోసుకొని గంతులు వేసేదే!

దీపాలు పెట్టిన కొంచెంసేపటికి రామచంద్రంగారు యింటికి వచ్చాడు.

కాళ్ళు కడుక్కుంటూనే "అమ్మాయ్. సావిత్రీ!" అని కేకేసి సావిత్రి ప్రాణం విసిగేవరకూ కుశలప్రశ్నలు వేశాడు. ఆఖరికి "మీ ఇంట్లో నేను పోయినసారి వచ్చేసరికి మల్లి అంటు ఒకటి వేశారు కదా! అది పూసిందా!" అని కూడా అడిగాడు. "మీ వంటపుట్టి ఇదివరకావిడేనా? ఆవిడ కొంచెం చెయ్యివిసురు బాపతుట కదా; మీ వాన్న తీసేస్తానన్నాడులే!" అని భోగట్టా చేశాడు. "ఓ, ఆవిడా? నేను ఇంటర్మీడియేట్ ఫస్టియర్‌కదూ అప్పుడు" అన్నది సావిత్రి.

సావిత్రికి మేనమామంటే సహజంగా కొంత భయమూ, గౌరవమూ వున్నాయి. అది తప్పించుకోలేనిది. అతగాడింక కుశల ప్రశ్నలు మానేసి "భోజనాలు చెయ్యండమ్మాయ్!" అని పీధి సావిట్లోకి వెళ్ళిపోయేదాకా అక్కడే నిలబడింది ఓపికగా.

వసంత పచ్చగా బంగారం ఛాయలో ముద్దువస్తూ వుంటుంది. ఉడతపిల్లలాగ చురుగ్గా వుంటుంది. కాని కొంచెం గడుసరి. పల్లెటూరిదేమో మరి! ఆ పిల్ల ప్రశ్నలకే సావిత్రి తికమక అయ్యేది.

భోజనాలదగ్గర సావిత్రి తిండివాలకం చూసి "అయ్యో తల్లీ! మరీ తూచి తూచి తింటున్నావేమిటి? అందుకే తోటకూర కాడలాగ యిలా అయిపోతున్నావ్!" అని ఆప్యాయంగా దెబ్బలాడింది సుందరమ్మ.

"నాకింతే అలవాటత్తాయ్. అదీగాక అన్నం వుత్త 'స్టార్చ్.' అది తింటే బలం ఏమీ రాదు. అవన్నీ మీ చాదస్తాలు!" సావిత్రి పెరుగులో చెయ్యిపెట్టి అన్నం కెలుకుతూ సత్యంకేసి జూసింది.

"అది కాదమ్మా! లావెక్కిపోతామేమోనని బెంగ! సావిత్రి నవేదేముందిలే, ఈ కాలం కాలేజీ అమ్మాయిలందరికీ యిదే భయం! కొంటెతనంగా అందుకున్నాడు సంభాషణ సత్యం.

టిక్కెట్టు లేకుండా రైలు ఎక్కినవాడిని చూసినట్లు చూసి "నువ్వు కాలేజీలన్నీ తిరిగి స్టడీ చేశావు కాబోలు!" అని దెప్పిపొడిచింది సావిత్రి.

సత్యం అమె వెటకారం పట్టించుకోకుండా ముంతలో పెరుగు గుమ్మరించుకుని, రెండు అరటిపళ్ళు అందులో వేసుకుని జుర్రడం మొదలెట్టాడు. సావిత్రి ఆశ్చర్యంగా అటు చూడడం

గమనించి వసంత "వదినా! నేర్చుకుంటున్నావా?" అని నవ్వేసింది.

"ఇదేం బ్రహ్మవిద్యా.. ఆల్జీబ్రానా?... నేర్చుకుందికి. బండాకూటి తిళ్లు నాకు అసహ్యం!" అని సావిత్రి చెయ్యి కడిగేసుకుంది. సుందరమ్మ నొచ్చుకుందిగాని నోరు మెదపలేదు. భర్తదగ్గర ఆవిడకి చాలా భయం.

సత్యం, వసంతా యిద్దరూ నేరస్తుల్లాగ మూతులు కడుక్కొని అవతలికి పోయారు!

సావిత్రికి ఇంటిదగ్గర అలారం పెట్టుకున్నా తెలివి వచ్చేది కాదు. కాని ఇక్కడ కోడికూతలు "లేస్తేకాని వదలవురా" అనిపించి - సూర్యోదయం అయ్యేసరికే లేచి పోయింది. వసంతకూడా గబుక్కున లేచి వచ్చి "వదినా, వొదినా! నీ ముహం జూశానమ్మా! ఏం జరిగినా నీదేనమ్మా! "అని సావిత్రిని పెరట్లోకి రెక్కపుచ్చుకుని తీసికెళ్ళింది.

సత్యం చెట్టెక్కి, వేప్పుల్ల విరుచుకుని పళ్ళు తోము కుంటున్నాడు. సావిత్రి గర్వంగా టూత్‌పేస్టూ, బ్రష్షూ పెట్టి పళ్ళు తోముకుంది. వసంతకూడా "పేస్టుపుచ్చుకుని తియ్యగా వుందే తల్లీ!" అనుకుంటూ కొంత తినేసింది.

సావిత్రి ఒక్కర్తికి కాఫీ కలిపి ఇచ్చింది సుందరమ్మ. వసంతా సత్యం యిద్దరూ "చల్ది వణ్ణం" తిన్నారు. అంతలో రామచంద్రంగారు యింట్లోకి వచ్చి "అమ్మాయి సావిత్రీ! ఇదో యిడ్డెన్లు. అయ్యరు వేడీ వేడి వాయి తీసి యిచ్చాడు. మీకు మీ యింట్లో ట్రిఫిన్లాయిరి - నాకా యిక్కడ దేవతార్చనాయిరి-" అని అరడజను యిడ్డెన్ల పొట్లం ఆమె చేతులలో పెట్టి స్నానానికి వెళ్ళిపోయాడు.

"ఐతే ఈ గ్రామంలో అయ్యరు హొటేలూ, గాంధీ పార్కూ కూడా వున్నాయన్నమాట!" అని వెటకారం చేసింది సావిత్రి సత్యాన్ని. సత్యం నవ్వుతూ "మీ వదిన ఏమిటో అంటున్నది విను వసంతాలూ!" అన్నాడు చెల్లాయి నుద్దేశించి.

"అంతేకాదు వదినా! మా ఊళ్లో సంతకూడా అవుతుంది ఎల్లుండి" అమాయకంగా వసంత చెప్పింది.

"ఓహో! అలాగా!" అని కళ్ళు చక్రాల్లాగ తిప్పింది సావిత్రి. "మీ అన్నయ్య అక్కడ ఏమిటే మిటి అమ్ముతాడేమిటి?" అని యిడ్డెన్లు రెండు తిని తక్కిన వాటిని అవతలికి నెడుతూ అడిగింది.

"ఛీ! మేం కొనుక్కుంటాం అమ్మం" అని విసుక్కుంది వసంత.

సత్యంకేసి 'చూసుకో నా దర్జా' అన్నట్లు చూసి ప్లేటు లోనే చెయ్యి కడుక్కుంది సావిత్రి.

సత్యం పని వున్నవాడిలాగ వెళ్లిపోయాడు. రామచంద్రంగారు దేవతార్చనకి వెళ్ళిపోయారు. వసంత బొమ్మలన్నీ పట్టుకుని పొరుగింటికి "తుర్రు"మన్నది.

సావిత్రి ఆ యింటి వ్యవహారమంతా ఆశ్చర్యంగా అగుపించింది. కుతూహలం కలిగింది. ఈ సత్యం తను అనుకున్నంత "ఎంబన్న" కాడు. అత్తయ్య ఆచారం, శుచీ, శుభ్రం,కలుపు కోరు తనం అవీ సావిత్రికి నివ్వెరపాటుకలిగించాయి. వసంత మొదలు మామయ్యవరకూ ఆమెనింత పిసరయినా కొత్త గానూ, ఎరుసుగానూ చూడలేదు.

సత్యం అందగాడని ఒప్పుకుంది.సావిత్రి హృదయం: కాని తండ్రి చెప్పిన "ఎడ్డెరెకం మనిషిని " యింకా అతనిలో వెతుకుతూనే వుంది ఆ పిల్ల మనసు. తను ఫస్టుక్లాసులో ప్యాసవుతే సత్యం ఫెలయ్యాడు. అందులోకి తను చదివింది మద్రాసులో. సత్యం చిన్న వూళ్లో. తనో లెక్కలు. సత్యం లిటరేచరు.లెక్కలు తెగవచ్చును అనికూడా ఆ పిల్ల ధైర్యం.

సావిత్రి కల్పించుకున్న అసహ్యం... ప్రత్యక్షంగా కనిపిస్తున్న స్వర్గం.. రెండిటిమధ్యా కెరటంమీద కెరటంలాగ ఆలోచనలు తిరుగుతూవుంటే హతాశయై వీధి గుమ్మంలోకి వెళ్ళి నిల్చుంది.

వీధి కొసదనుక అటూ ఇటూ మెడ సారించి చూసింది. మట్టిరోడ్డయినా చాలా మేరకు అలికి ముగ్గులున్నాయి. మధ్య మధ్య పాకలున్నా చాలావరకూ పెంకుటిళ్ళే. పట్నంలోలాగ ముమ్మరంగా పందులూ, "క్యూ"లో వచ్చి, చెవులు చిల్లులు పడేలాగ అరిచే ముష్టివాళ్ళూ లేరు.

ఒకరూ అర మనుషులు మాత్రమే అక్కడ సందడి, కొందరు కన్నెపడుచులు పాదాలకు పసుపు రాసుకుని తడిజుట్టు ముడివేసుకుని చెరువునుంచి కాబోలు నీళ్ళు తెచ్చుకుంటున్నారు.

అసెరమ్మంత బిందెలు మోసుకొస్తున్నా ఎక్కడా అలసటగానీ, గాభరాగాని లేకుండా ఒయ్యారంగా నీళ్ళు తెచ్చుకుంటున్న ఒకరిద్దరు తన తోటియీడు పిల్లల్ని చూసి, సావిత్రి ఈసుపడింది. వీళ్ళేం తింటారు చెపుమా? నాజూగ్గా కలువకాడల్లాగ వున్నారు అనుకుంది.

ఇంతలో తన ఈడుదే ఓ పద్దెనిమిదేళ్ళ కన్నెపిల్ల సావిత్రిని పరీక్షగా చూస్తూ పుస్తకాలు పట్టుకుని ఆ ఇంట్లోకి వచ్చింది. ముందుగదిలోకి తొంగిచూసి ఎవరూ లేకపోవడం గమనించి వెనుదిరిగి సావిత్రినే అడిగింది. "ఏవండీ,సత్యంగారు లేరా?" అని. నాగుపాములాగ అంత బారువున్న ఆ పిల్ల జెడ కేసి చూస్తూ వున్న సావిత్రి తెలివి తెచ్చుకుని "లేదు" అంది. "ఏంగావాలి?" అని అప్రయత్నంగా అడిగింది.

పట్నంలో బ్రతుకుతూ కాలేజీలో అంత చదువు కొన్న సావిత్రి సంస్కారమూ, నాగరికతా అన్నీ కలిపి అనుకున్నదేమిటీ? అంటే ఆ పిల్లనిగురించి అదోలాగ అనుకోవడం.

"పాఠం నేర్చుకుందికి వచ్చానండీ... పిన్నిగారు లేరల్లే వుంది అని ఆ పిల్ల గదిలోకి వెళ్ళబోయి ఆగి "మీరెవరండీ"? అని అడిగింది.

సావిత్రికి జవాబు వెంటనే స్ఫురించలేదు. "మిస్ సావిత్రి, బి.ఎ.' అనబోయి "నేను... నేను... ఇది మా మావయ్యగారి ఇల్లు" అంది తడబడుతూ.

ఆ పిల్ల అంతలో చనువుగా నవ్వేసి "అదా, అలా చెప్పు! మీరు సావిత్రివొదినన్నమాట!" అని అడిగింది తన కేదో పెద్ద రహస్యం తెలిసినట్లు.

ఈ పరిచయం గమ్మత్తుగా వుంది సావిత్రికి. "నమస్కారం" అనడం - పొడిపొడిగా ఏవేవో మాటలనడం - మనిషి దుస్తులూ అవీ విలువకడుతున్నట్లు చూసి "ఈ బ్లౌజు ఎక్కడ తీశారు?", "మీరే పౌడరు వాడుతారు?" లాంటి ప్రశ్నలు అడగడం - ఏమీలేదు ఇక్కడ.

ఈ ఇద్దరమ్మాయిలూ ఇంకా ఒకరినొకరు అర్ధం చేసుకున్నారో లేదో, వసంత రివ్వున వచ్చి బొమ్మల బుట్ట అవతల పడేసి "అన్నయ్య పళ్లగంప పట్టించుకొస్తున్నాడహో అని 'అనౌన్స్' చేసింది

రొప్పుతూ.

సత్యాన్నీ, పళ్ళగంపనీ ఎదుర్కొని "అన్నోయ్! ఇవన్నీ వాదినకే!" అన్నది కొత్తపిల్ల నిర్మలంగా మొహం అంత జేసుకొని చూస్తూ.

సత్యం నవ్వుతూ "వస్తున్నానమ్మా కమలం! ఆ గదిలో కూచో!" అని లోపలికి వెళ్ళిపోయాడు.

సావిత్రి సత్యం పట్టుకొచ్చిన పళ్ళగంపకేసి చూసింది. "అబ్బ! ఎవరు తినను బాబూ ఇన్ని పళ్ళు!' ' అనుకుంది. "అందులోకీ సీతాఫలపుపళ్ళుకూడాను... వెక్కిరించినట్లు" కాని పైకి ఏమీ అనలేదు.

కమలం సత్యం గదిలోకి వెడుతూ "ఒదినా! అన్నయ్య గది చూద్దువుగాని రా!"అని పిలిచింది. సావిత్రి రాతిబొమ్మలాగ నడిచి వెళ్ళింది.

"నువ్వేం చదువుతున్నావ్?" అని గోడని అడిగినట్లు అడిగింది. కమలం చెప్పింది "హిందీ విశారదకి వెళుతున్నాను."

సావిత్రి గతుక్కుమంది. బలవంతంగా తన నెత్తిన రుద్దిన హిందీలో అంతంత ప్రావీణ్యమే సంపాయించింది. అయితే సత్యం అంతవరకూ పాఠాలే చెపుతాడన్న మాట!

కమలం సావిత్రిని పరిశీలనగా చూస్తున్నది. ఒదులుగా జడ అల్లుకుని మొహాన చిన్న కుంకుమబొట్టు పెట్టుకుని ఒదులుగా కుర్చీలో కూర్చొన్నసావిత్రి, మగవాళ్ళలాగ కూర్చున్నట్లనిపించి కమలానికి. దర్జా కాబోలు అనుకుంది. సావిత్రికి ఇదేం పట్టలేదు. కొంపదీసి తనని పాఠం చెప్పమనదుగదా! బెంగగా కూర్చుని చటుక్కున లేచి గది పరిశీలనగా చూడటం మొదలెట్టింది.

ఒకవేపు చిన్న బల్లా, కుర్చీ అమర్చి వున్నాయి. కుర్చీలో పులిచర్మం, బల్లమీద చేనేత టేబిల్‌క్లాత్‌వేసి వున్నాయి.

పెద్ద రాక్ నిండా పుస్తకాలు ఉన్నాయి. చాలా మట్టుకి తెలుగు, కొన్ని హిందీ, తతిమ్మావి ఇంగ్లీషు. అవన్నీ ఆషామాషీగా తిరగేసి మళ్ళీ అందులోనే పెట్టేసింది సావిత్రి. ఇన్ని చదివిన సత్యం బియ్యే ఫేలవడాన్ని సమన్వయించలేక పోయింది సావిత్రి.

రాత్రింబగళ్ళు లెక్కలే ప్రాణం! లెక్కలే పారాయణం. పది సంవత్సరాల యూనివర్సిటీ పేపర్లు తెప్పించి ఆన్సర్సుచేసి, నూరుకు తాగేసేసి, ఫస్టుక్లాసు తెచ్చుకున్న సావిత్రికి తనకేమీ రాదు కాబోలు' ' అని, తుఫానుముందుకలిగే శూన్యమంత వెలితి కలిగింది.

కమలం కన్నార్పకుండా తనకేసి ఏ,సరస్వతీ దేవియో అన్నట్లు చూస్తూవుంటే సావిత్రి కొంత తృప్తిపడి "ఇవేం కొత్తవిగావు. అన్నీ నాకు కంఠతాయే" అన్నట్లు పుస్తకాలు ఒదిలి తిరిగి వచ్చి కూర్చుంది.

"ఒదినోయ్! దానిమ్మపండు" అంటూ వసంత వచ్చింది. సావిత్రి వసంతని చూసి "సత్యం పళ్ళుతినడమేనా? వచ్చి ఈ అమ్మాయికి ఏమైనా పాఠం చెప్పడం వుందా?" అని అడిగింది. కమలం ఈ పొడిమాటల కూర్పుకి నొచ్చుకుంది. మొహం కళావిహీనం చేసుకుంది, పట్నంలోని నాగరికులకుమల్లే గోడలుకట్టుకుని, మడిగా బతకడం తెలీని పిల్ల కమలం. "ఒదినా" అని తను పిల్చిన సావిత్రి తనని "ఈ అమ్మాయి" అని పుల్లవిరుపుగా అనడం సహించలేకపోయింది.

"అక్కయ్యా! నాకు అంబర్ చరఖా నేర్పవే" అన్నది వసంతం కమలం ఒళ్ళో దబాయించి మరీ కూర్చుని.

"వదిన్నడుగు" అన్నది కమలం. సావిత్రి గుండెల్లో రాయి పడ్డది. నీకు వచ్చునా? అని అడిగింది సావిత్రి సమయోచితంగా కమలాన్ని.

అందుకు వసంత "అయ్యో తల్లీ! పరీక్ష పాసయిందే" అంది చేతులు తిప్పుతూ.

"ఇష్ వూరుకో, అన్నయ్య" అన్నది కమలం తలుపు కేసి చూసి.

సావిత్రి లేచి గిరుక్కున అక్కడినించి వెళ్లిపోయింది. కూడా వసంత వెంటబడి "ఎచ్చనగాయలాడతావా ఒదినా?" అని పట్టుకుంది. సావిత్రికి అదీరాదు.

తనకి వున్న దురభిప్రాయాలూ, అపోహలూ చెరుపుకుని, నాలుగురోజులయ్యేసరికల్లా సావిత్రి చాలా సర్దుకుంది. నూతిలో గిలకమీంచి తాడువేసి, రెండు మూడు సార్లు నీళ్ళు కూడా తోడుకుంది. నూతిలో మొహం చూసుకుని మురిసి పోయింది.

వసంత మీద వాత్సల్యం, సత్యంమీద గౌరవం కొంచెం కొంచెంగా ఆమెకి తెలియకుండానే ఆమెలో వృద్ధిపొందడం మొదలెట్టాయి.

పట్నంలో ఎంతసేపూ సూటూ బూటూ వేసుకున్న మగవాళ్ళనే చూడ్డంచేత, సత్యం మొరటుతనంగా అనిపించాడు గానీ, సత్యానికి ఏ దుస్తులయినా అతికినట్లుంటాయని అతని కాలేజీ ఫోటోలు చూసి అనుకుంది సావిత్రి.

"ఏం? సావిత్రీ దేవీ! ఏమిటి ఆలోచిస్తున్నారు?" అని సత్యం నూతిదగ్గరకు వచ్చాడు. సత్యాన్నిచూసి ఉలిక్కిపడింది.

"పోవోయ్! నీ వూసుగాదు" అంటూ నూతిగట్టుకటు వైపు తిరిగి వెళ్ళిపోయింది సావిత్రి. సావిత్రి పోవోయి అన్నప్పుడు సిగ్గుదొంతర్లుపడింది. ఒయ్యారం, చిలిపితనం చిందులు వేశాయి. కంఠంలో కంచుగంటలాంటి కంపితధ్వని వచ్చింది. సత్యం పులకించి ముగ్ధుడయ్యాడు. నూతిలో తన మొహం చూసుకుని మురిసిపోయాడు.

సావిత్రి చాలా మారిపోయింది. ఆమెలో వసంతం వచ్చింది! సత్యంతో సరదాగా వెళ్ళి అంబర్చరఖా చూసింది. రామచంద్రంగారి తోటల్లో, పొలాల్లో పసి పిల్ల లాగ మైమరచి ఆడుకుంది.

ఒక చెరనించి, స్వేచ్ఛ నిండిన మరొకలోకంలోకి రెక్కలు విప్పుకుని ఎగిరి వచ్చిన పిట్టలాగున వుంది సావిత్రి హృదయం.

"సత్యం!" అన్నది సావిత్రి తూరుపు తెలతెలవారుతూండగా.

మువ్వల్ని తాడుతో పేని గుచ్చి, తువ్వాయి మెళ్ళో కడుతూ. "ఊఁ" అన్నాడు సత్యం గోముగా ...సావిత్రి అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

ఒక సాయంత్రం: సావిత్రి అత్తయ్య "తులసీ జలజనాభ కృప పడసీ "పాట పాడుతూండగా శ్రద్ధగా విన్నది. రాత్రి వెన్నెల పుచ్చపువ్వులా కాస్తుండగా "వెన్నెల ఎంతో బాగుంది" అనుకుంది సత్యాన్ని

ఆ దగ్గరలోనే చూసి.

"మావూళ్లో వెన్నెల సంగతే జ్ఞాపకం రాదు సుమా!" అనుకుంది గట్టిగా అతనికి వినపడేలాగు.

"అందుకే మా వూళ్ళోనే వుండిపోగూడదూ హాయిగా!" అన్నాడు సత్యం సావిత్రి వెనకనే వచ్చి నించొని ఆమె శిరోజాల్నిమూర్కొని.

"నాకు సంగీతంరాదు సత్యం - వీణ వాయించలేను - అంబర్ చరఖా ఒడకలేను. ఆఖరికి వంటకూడా రాదు సత్యం" అని బేలపడిపోయింది సావిత్రి.

"అవన్నీఎందుకూ! ఎం.ఏ. డిగ్రీ వస్తుందికదా." ఓదార్పుగా అన్నాడు సత్యం.

"ఊఁ... అయితే ఎం.ఏ. డిగ్రీ వచ్చాకా?" అని అడిగింది కోపంగా.

"తర్వాత పి.హెచ్.డి చేస్తావ్!"

"ఆ తర్వాత?"

సత్యం జవాబు చెప్పలేదు. నిజానికి అతగాడికీ స్ఫురించలేదు.

సావిత్రి బరువుగా చెప్పింది. "లేదు సత్యం, నాకు ఎం.ఏ. డిగ్రీ వద్దు. జీవితం కావాలి. ఆనందం కావాలి. యూనివర్శిటిలో యింకా చదువుకొని నేను సార్ధకం చేసుకొనేది ఏమీలేదు."

అక్కణ్నించి నెమ్మదిగా వెళ్ళిపోయింది సావిత్రి.

సత్యం దిగ్భ్రాంతుడై అక్కడే గుంజకానుకుని వుండి పోయాడు. అతనిలో ఆనందం కట్టలు తెంచుకుని పరవళ్ళు తొక్కింది.

పరవశుడయిన సత్యం అంతలో.... "ఏవండోయ్ బావగారూ! అత్తయ్య భోజనానికి రమ్మంటున్నాది... ఏ లోకంలో వున్నారు?" అని సావిత్రి వేసిన తియ్యని కేకకి ఉలిక్కిపడి.

"స్వర్గంలో" అన్నాడు.

(1960, ఆంధ్రప్రతిక వారపత్రిక)